

రంప అటవీ డివిజన్‌లో ఇంటి దొంగలు

- 400కు పైగా టేకు చెట్లు నరికేసి 300కి పైగా తరలించేసిన వైనం
- ఇద్దరు తాగుబోతు దొంగల వాగ్వాదంతో భాగోతం బట్టబయలు
- రంగంలోకి దిగి నిగ్గుతేల్చిన అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్

-వార్త 6వ పేజీలో...

ఎన్నికలకు సమాయత్తం

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు

- ఐటీడీఏ కార్యాలయంలో అరకులోయ ఆర్వో కార్యాలయం
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్, ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పంపిణీ కేంద్రాలు
- జిల్లా వ్యాప్తంగా 7,61,255 మంది ఓటర్లు, 1,021 పోలింగ్ కేంద్రాలు



కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధమవుతున్నది. జిల్లాలోని 22 మండలాల్లో పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల కమిషన్ సూచనలతో 1,021 పోలింగ్ కేంద్రాల్లో సార్వత్రిక ఎన్నికలను సజావుగా జరిపేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి హోదాలో కలెక్టర్ విజయసునీత ఆధ్వర్యంలో చేస్తున్నారు.

డిగ్రీ కళాశాల ఆవరణలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్

జిల్లాలో ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచే నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంలు, వీవీప్యాట్‌లను తరలిస్తారు. పోలింగ్ అనంతరం వాటిని సేకరించి, ప్రత్యేక భద్రతతో ఇక్కడికే తీసుకువచ్చి, స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తారు. అలాగే ఎన్నికల కమిషన్ సూచనలతో కౌంటింగ్ సైతం డిగ్రీ కళాశాల ప్రాంగణంలోనే నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ విజయసునీత ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. అలాగే పోలింగ్ ముందు రోజు ఎన్నికల సిబ్బందికి సామగ్రి, ఈవీఎంలు, వీవీప్యాట్‌లు పంపిణీ చేసేందుకు పాడేరులోని తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో, అరకులోయలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో, రంపచోడవరంలో స్థానిక ఆశ్రమ పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ అనంతరం స్వీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్

ఎన్నికల నిర్వహణలో భాగంగా అప్పటికప్పుడు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం, ఇబ్బందులను అధిగమించేందుకు స్థానిక కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అందులో 16 విభాగాలకు సంబంధించిన డెస్కులను ఏర్పాటు చేసి, వాటిని పర్యవేక్షించేందుకు 19 మంది నోడల్ అధికారులను నియమించారు. మేన్‌పవర్ మేనేజ్‌మెంట్, ట్రైనింగ్, మెటీరియల్, ట్రాన్స్‌పోర్ట్, కంప్యూటరైజ్, సైబర్, ఐటీ, లా అండ్ ఆర్డర్, ఈవీఎంలు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, ఎన్నికల వ్యయం బ్యాలెట్ పేపర్, పోస్టర్ బ్యాలెట్, మీడియా, కమ్యూనికేషన్ ప్లాన్, ఓటర్ల జాబితాలు, ఫిర్యాదులు, ఓటర్స్ హెల్ప్‌లైన్, అబ్జర్వేషన్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులను ఏర్పాటు చేశారు.



ఐటీడీఏ కార్యాలయంలో అరకులోయ ఆర్వో కార్యాలయం

ఐటీడీఏలో అరకులోయ ఆర్వో కార్యాలయం

స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఐటీడీఏ పీవో అభిషేక్ ఆర్వోగా వ్యవహరించనున్నారు. ఈ నియోజకవర్గంలో అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని 304 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2 లక్షల 41 వేల 360 మంది ఓటర్లున్నారు. అరకులోయ ఎమ్మెల్యేగా ఎన్నికల బరిలో దిగే అభ్యర్థులు ఐటీడీఏ కార్యాలయానికి వచ్చి తమ నామినేషన్ల సమర్పణ, పరిశీలన, ఉపసంహరణ వంటి ప్రక్రియలు జరుగుతాయి.



పాడేరు డిగ్రీ కళాశాలలో ఈవీఎంల పంపిణీ సెంటర్‌ను పరిశీలించి వస్తున్న కలెక్టర్ విజయసునీత(ఫైల్)

ఏర్పాటు కాని పాడేరు ఆర్వో కార్యాలయం

పాడేరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక కలెక్టరేట్‌లోనే రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. జాయింట్ కలెక్టర్ పాడేరు అసెంబ్లీ ఆర్వోగా వ్యవహరించనున్నారు. అయితే ప్రస్తుతానికి ఆర్వో కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేదు. నియోజకవర్గం పరిధిలోని పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల పరిధిలో 318 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2 లక్షల 44 వేల 925 మంది ఓటర్లున్నారు. పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థులు తమ నామినేషన్ల సమర్పణ, ఉపసంహరణలకు స్థానిక ఐటీడీఏలోని ఆర్వో కార్యాలయానికి రావాల్సిందే.



జెండా కోసం కర్రల పోగు చుట్టూ నిల్చొన్న యువకులు

అంబరాన్నంటిన హోలీ సంబరం

- తాజంగి బీటాలైన్‌లో సందడి
- 60 అడుగుల కర్రల పోగు దహనం



కర్రల పోగు కాలుతున్న దృశ్యం

చింతపల్లి, మార్చి 25: మండలంలోని తాజంగి పంచాయతీ బీటాలైన్ రాధాకృష్ణ ఆలయం ప్రాంగణంలో హోలీ సంబరాలు అంబరాన్ని తాకాయి. తాజంగి పంచాయతీ పరిసర ప్రజలు ప్రతి ఏటా రాధాకృష్ణ ఆలయం ఎదుట 60 అడుగుల ఎత్తు కలిగిన హోలీ కర్రల పోగును కాల్చడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ ఏడాదికి కూడా వారం రోజులపాటు స్థానిక ప్రజలు శ్రమించి ఈ కర్రల పోగును ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. అదే రోజు రాత్రి డ్యాన్స్ హంగామా సాంస్కృతిక కార్యక్రమాన్ని భక్తుల కోసం ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి కర్రల పోగుకు నిప్పుపెట్టారు. ఉదయం ఆరు గంటల వరకు ఈ కర్రల పోగు కాలుతూ కనిపించింది. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

జెండా పట్టుకున్న ఇద్దరు యువకులు

కర్రల పోగుపైన ఏర్పాటుచేసిన జెండాను ముంచంగిపుట్టు మండలం వనుగుమ్మ గ్రామ పంచాయతీకి చెందిన గొల్లోరి రాము, రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన వంతల శ్రీను అనే యువకులు పట్టుకున్నారు. ఉదయం నాలుగు గంటల నుంచి జెండాను పట్టుకునేందుకు కర్రల పోగు చుట్టూ యువకులు, పెద్దలు చేరుకున్నారు. ఉదయం ఐదున్నర గంటలకు కర్రలపోగు నుంచి జెండా వేరు అయ్యి ఉత్తర దిక్కున పడింది. ఈ జెండాను గొల్లోరి రాము, వంతల శ్రీను పట్టుకోవడంతో వారిని ... మిగతా 6వ పేజీలో

పడకేసిన పనులు

- మండలంలో నిలిచిపోయిన ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు
- అసంపూర్తిగా దర్శనమిస్తున్న సచివాలయ, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణాలు
- బిల్లులు మంజూరుకాకపోవడంతో నిలిపివేసిన కాంట్రాక్టర్లు



అసంపూర్తిగా ఉన్న పానిరంగిని గ్రామ సచివాలయ భవనం

అరకులోయ, మార్చి 25: మండలంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే), హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణ పనులు చాలా చోట్ల అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న ఈ భవనాలు ఎప్పటికి పూర్తవుతాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

మండలానికి 18 గ్రామ సచివాలయాలు, 18 రైతు భరోసా కేంద్రాలు, 8 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు మంజూరయ్యాయి. 2019 డిసెంబరు 17న గ్రామ సచివాలయాల భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం 18 గ్రామ సచివాలయాలకు రూ.7.20 కోట్లు, 18 రైతు భరోసా కేంద్రాలకు రూ.3.92 కోట్లు, 8 హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలకు రూ.1.19 కోట్లు కేటాయించినట్టు అప్పట్లో ప్రకటించింది. అయితే 18 సచివాలయ భవనాలకు గాను ఆరు మాత్రమే పూర్తయ్యాయి. మిగతావి అరకొర నిర్మాణాలతో నిలిచిపోయాయి. అలాగే 18 రైతు భరోసా కేంద్రాలకు గాను ఇవి కూడా ఆరు మాత్రమే పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో పనులు నిలిచిపోయాయి. ఎనిమిది హెల్త్ వెల్‌నెస్ సెంటర్లకు గాను రెండు చోట్లే పనులు ప్రారంభమయ్యాయి. మిగతా చోట్ల పనులు ప్రారంభంకాలేదు. సకాలంలో బిల్లులు మంజూరుకాకపోవడం వల్లే కాంట్రాక్టర్లు పనులు నిలిపివేసినట్టు తెలిసింది. ప్రభుత్వం ప్రాధాన్యతా భవనాలుగా గుర్తించిన వీటి పనులే పూర్తికాకపోతే మిగతా ప్రాజెక్టుల సంగతేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇక ఇప్పట్లో ఈ భవన నిర్మాణాలు పూర్తికానట్టేనని చెబుతున్నారు.



అరకులోయలో అసంపూర్తిగా ఉన్న ఆర్బీకే భవనం



అరకులోయలో అసంపూర్తిగా ఉన్న వెల్‌నెస్ సెంటర్

విమ్స్ అప్‌గ్రేడ్ ప్రతిపాదన అటకెక్కినట్టేనా?

- రూ.250 కోట్లతో ఆరు బ్లాకులు నిర్మిస్తామని రెండేళ్ల క్రితం ప్రకటించిన ప్రభుత్వం
- ఏడాది క్రితం టెండర్ల ప్రక్రియ పూర్తి
- ఇప్పటికీ మొదలుకాని పనులు
- పూర్తిస్థాయి వైద్య నిపుణులను నియమిస్తామన్న హామీ కూడా నెరవేరని వైనం
- బెడ్స్ పెంపుపైనా అదేతీరు
- కార్యరూపం దాల్చని పీజీ మెడికల్ కాలేజీ ఏర్పాటు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)ను పూర్తిస్థాయిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన కార్యరూపం దాల్చలేదు. సుమారు రూ.250 కోట్లు వెచ్చించి విమ్స్‌లో రెండో దశ (ఆరు బ్లాకుల్లో కొత్త భవనాలను) నిర్మాణం చేపడతామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. పదికిపైగా సూపర్ స్పెషాలిటీ విభాగాలను ఏర్పాటుచేయడంతోపాటు పూర్తిస్థాయి వైద్య నిపుణులను నియమిస్తామని పేర్కొంది. అయితే, ఈ ప్రకటన చేసి రెండేళ్లు పూర్తి కావస్తున్నా ఆచరణలో ఒక్క అడుగు ముందుకుపడలేదు. సుమారు ఏడాది కిందట టెండర్లు ప్రక్రియ పూర్తయ్యింది. ఆ తరువాత ఏమైందో నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో విమ్స్ అప్‌గ్రేడేషన్ నిలిచిపోయిందని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.



సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన విమ్స్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంది. కానీ, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించడం లేదు. ప్రస్తుతం విమ్స్‌లో 30 విభాగాల్లో సేవలు అందిస్తున్నారు. వీటిలో ఆరు వరకు సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఉన్నాయి. అయితే, ఇక్కడ పనిచేసే వైద్యులంతా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నవారే. పూర్తిస్థాయి వైద్యులు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదు. ప్రభుత్వం అప్‌గ్రేడేషన్‌లో భాగంగానే పూర్తిస్థాయి వైద్య నిపుణులను నియమిస్తామని చెప్పిన మాటను ఇప్పటివరకూ నిలబెట్టుకోలేకపోయింది.

800 బెడ్స్‌కు విస్తరణ

విమ్స్‌ను 800 పడకల ఆస్పత్రిగా విస్తరిస్తామని ప్రభుత్వం, ఆరోగ్య శాఖ మంత్రి గతంలో చెప్పారు. అయితే, ఈ ప్రతిపాదన కూడా కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికీ విమ్స్‌లో 450 పడకలు మాత్రమే ఉన్నాయి. పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడం వల్ల రోగులకు మెరుగైన సేవలు అందడం లేదంటున్నారు. ప్రస్తుతం ఉన్న బెడ్ల సంఖ్యను, అందుకు అనుగుణంగా వైద్య సిబ్బందిని పెంచడం ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.12
సహారి (బుధ)	4.42

స్వచ్ఛందంగా నాటు తుపాకులు అప్పగింత

- ముగ్గురు గిరిజనులను అభినందించిన ఎస్ఐ
- మండలంలో చాలా మంది వద్ద ఉన్నా అపోహల వల్ల అప్పగింతకు వెనకడుగు

పెదబయలు, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గిరిజనులు వేటకు ఉపయోగించే నాటు తుపాకులను స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించాలని ఇటీవల ఎస్పీ తుహిన్‌సిన్హా ఇచ్చిన పిలుపు మేరకు మండలంలో ముగ్గురు గిరిజనులు స్పందించారు. సోమవారం పెదబయలు పోలీస్ స్టేషన్ పరిధిలో గల గలగండా పంచాయతీ కూతంగిపుట్టుకు చెందిన పాంగి లవకుశ, కిల్లో గోపాల్, కొర్ర బిస్నాద్‌లు స్థానిక ఎస్ఐ మనోజ్‌కుమార్‌కు మూడు నాటు తుపాకులను అప్పగించారు. వీరిని ఎస్ఐ అభినందించారు. మండలంలోని 23 పంచాయతీల్లో ఎవరైనా నాటు తుపాకులు కలిగి ఉన్నట్లయితే స్వచ్ఛందంగా పెదబయలు పోలీస్ స్టేషన్‌కు అప్పగించాలని ఎస్ఐ కోరారు. లేకుంటే వారిపై భారతీయ ఆయుధాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తుపాకులు ఉన్నట్టు పోలీసులకు తెలిస్తే అరెస్టు చేస్తారనే అపోహలు పెట్టుకోవద్దని, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణ కోసం తుపాకులను అప్పగించాలని కోరారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా మూడు నాటు తుపాకులు మాత్రమే స్టేషన్‌లో అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.



అప్పగించిన నాటు తుపాకులతో గిరిజనులు, ఎస్ఐ మనోజ్‌కుమార్

పసుపు ధర పతనం

- కిలోకి రూ.20 తగ్గిపోయిన వైనం
- ఆర్‌వీనగర్ సంతలో కిలో రూ.115
- గత రెండు వారాల్లో రికార్డు స్థాయిలో రూ.135 పలికిన ధర
- ధర తగ్గడంతో ఆదివాసీ రైతులు డీలా



ఆర్‌వీనగర్‌లో వర్తకులు కొనుగోలు చేసిన పసుపు బస్తాలు

గూడెంకొత్తవీధి, మార్చి 25: గిరిజన ప్రాంతంలో పసుపు ధర ఒక్కసారిగా పడిపోయింది. కిలోకి రూ.20 తగ్గిపోయింది. మార్కెట్ ప్రారంభంలో కిలో పసుపు ధర రూ.90- 100 ఉండేది. గత రెండు వారాల్లో పసుపు ధర రికార్డు స్థాయిలో రూ.135కి పెరిగింది. పసుపు పంటకు డిమాండ్ పెరగడంతో పొరుగు జిల్లాలు, రాష్ట్రాల వర్తకులు సైతం చింతపల్లి, జీకేవీధి మండలాలకు వచ్చి కొనుగోలు ... మిగతా 6వ పేజీలో

క్రైం... crime news

39 మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు


దామునాపల్లి వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

చోడవరం, మార్చి 25: మండలంలోని దామునాపల్లి గ్రామం జంక్షన్ వద్ద అదే గ్రామానికి చెందిన చవితిన గోవింద నుంచి ఎస్ఐ శేఖరం సోమవారం మధ్యాహ్నం 39 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్లు అక్రమంగా రవాణా చేస్తున్నట్టు అందుకున్న ఎస్ఐ శేఖరం తన సిబ్బందితో కలిసి గోవిందను అరెస్టు చేసి అతని నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

కృష్ణాదేవిపేటలో..

కృష్ణాదేవిపేట : బెల్టు షాపునకు తరలిస్తున్న 13 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఒకరి అరెస్టు చేశామని కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యూరు మండలం శరభన్నపాలెం గ్రామానికి చెందిన రాజేశ్ మద్యం క్వార్టర్ బాటిళ్లను శరభన్నపాలెంలో విక్రయించేందుకు తీసుకువెళుతున్నాడు. ఈ నేపథ్యంలో గొలుగొండ మండలం కొంగసింగి జంక్షన్‌లో పోలీసులు సోమవారం పట్టుకున్నారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట, మార్చి 25: మండల కేంద్రమైన అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణం(బెల్ట్ షాపు)పై పోలీసులు దాడి చేశారు. 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని దుకాణం నిర్వాహకుడు కర్రి సూర్య ప్రకాశ్‌ను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు తెలిపారు.

పీటీడీ కాంప్లెక్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అనకాపల్లి టౌన్, మార్చి 25: స్థానిక పీటీడీ కాంప్లెక్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. 55 నుంచి 60 ఏళ్ల వయసు ఉంటుందని, మృతుడి వద్ద మరేఇతర ఆధారాలు లభ్యం కాలేదన్నారు. ఇతను రెండు వారాల నుంచి పీటీడీ కాంప్లెక్స్ వద్దే ఉంటున్నట్టు స్థానికులు చెబుతున్నారని, మృతుడిని ఎవరైనా గుర్తిస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారమివ్వాలని ఆయన కోరారు.

కడుపునొప్పి తాళలేక బాలిక ఆత్మహత్య

చోడవరం, మార్చి 25: మండలంలోని వెంకన్నపాలెంలో సోమవారం రాత్రి ఓ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి సీఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. వెంకన్నపాలేనికి చెందిన నంబారు వరలక్ష్మి(17) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. సోమవారం రాత్రి 7 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చిచూసేసరికి ఆ బాలిక విగతజీవిగా ఉంది. మృతురాలి తల్లి గున్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

చెట్టు పైనుంచి జారి పడి ఒకరికి తీవ్ర గాయాలు

రావికమతం, మార్చి 25: మండలంలోని మేడివాడలో చింత చెట్టు ఎక్కిన ఓ వ్యక్తి జారి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మేడివాడ గ్రామానికి చెందిన సోమిరెడ్డి అప్పారావు(43) సోమవారం మధ్యాహ్నం పొలంలో చింత చెట్టు ఎక్కాడు. దాని పైనుంచి జారి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కొత్తూరు, మార్చి 25 : అనకాపల్లి మండలం మెట్టపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. మెట్టపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన మువ్వల దేముళ్ల (48) ఆదివారం రాత్రి మద్యం అతిగా సేవించి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. కాగా దేముళ్ల మృతిపై తనకు అనుమానం ఉందంటూ అతని తమ్ముడు సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ చెప్పారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

కశింకోట, మార్చి 25: మండలంలోని నర్సింగబిల్లి శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశామని హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.2,500 నగదు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

కూండ్రంలో మళ్లీ అగ్నిప్రమాదం.. రెండు పాకలు దగ్ధం

కొత్తూరు, మార్చి 25: మండలంలోని కూండ్రం గ్రామంలో మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం తెల్లవారుజామున సేనాపతి కాసుకి చెందిన రెండు పశువుల పాకలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ గ్రామంలో నెలలో ఐదుసార్లు అగ్ని ప్రమాదాలు సంభవించాయని, గుర్తు తెలియని వ్యక్తులు ఈ ఘాతుకానికి పాల్పడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ప్రధానికి ఎన్నికల కోడ్ వర్తించదా?

- ఫిర్యాదు చేసినా ఈసీఐ స్పందించదేమి?
- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ


ఈఏఎస్ శర్మ

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత దేశ ప్రధానికి ఎన్నికల కోడ్ వర్తించదా?, ఆయనపై అందిన ఫిర్యాదులను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పట్టించుకోదా?...అంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ వ్యాఖ్యానించారు. ఆయన సోమవారం కొన్ని మీడియా సంస్థలతో మాట్లాడుతూ, వారం క్రితం తమిళనాడులో ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలపై తాను ఈసీకి ఈ నెల 22న ఫిర్యాదు పంపగా ఇప్పటివరకూ దానిపై ఎటువంటి స్పందన లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు రాజకీయ నాయకులు మతపరమైన అంశాలపై మాట్లాడకూడదని, అది ఉల్లంఘన కిందికే వస్తుందని శర్మ చెబుతున్నారు. 'హిందువులు నారీశక్తిని, మాతృశక్తిని బలంగా విశ్వసిస్తారని, అటువంటి శక్తిని నాశనం చేయాలని ఇండియా కూటమి పిలుపునిచ్చిందని, దానిని దేవతలను పూజించే తమిళులు ఆమోదిస్తారా?, హిందూత్వాన్ని అవమానిస్తూ ఇండియా కూటమి పదే పదే మాట్లాడుతోందని, దానిని సహిస్తామా?'...అని మోదీ ఆ సభలో ప్రసంగించినట్టు వార్తలు వచ్చాయని శర్మ తెలిపారు. ఆ ప్రసంగాన్ని పేర్కొంటూ తాను ఈసీకి ఫిర్యాదు చేశానన్నారు. ఒకవేళ ఆ మాటలు నిజమైతే మతపరమైన ప్రసంగం చేసినందుకు ప్రధానిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే ఇప్పటివరకు ఎన్నికల సంఘం దానిపై స్పందించకపోవడంతో తనకు ఆశ్చర్యం, అనుమానం కలుగుతోందన్నారు. దేశాన్ని పాలిస్తున్న పొలిటికల్ ఎగ్జిక్యూటివ్ ద్వారా నియామకం పొంది, ఎన్నికల సంఘం కార్యాలయంలో తిష్ట వేసినందున, ఆ ఎగ్జిక్యూటివ్‌కి విశ్వాసంగా ఉండాలని ప్రయత్నిస్తున్నారా?...అని శర్మ ప్రశ్నించారు. ఎన్నికల సంఘాన్ని ఇలాగేనా నియమిస్తారు? అంటూ పోల్ బాడీని ప్రశ్నించారు. తన ప్రశ్నలకు ఎన్నికల సంఘం పబ్లిక్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

ఉపమాక క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

- పౌర్ణమి కావడంతో స్వామి దర్శనానికి పెద్ద సంఖ్యలో రాక
- భక్తులకు తాగునీటి సరఫరాలో అధికారులు విఫలం


ఉపమాక ఆలయం బయట భక్తుల క్యూ లైన్


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి, మార్చి 25: ఉపమాక క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కల్యాణోత్సవాలపాటు పౌర్ణమి కావడంతో స్వామివారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాలతోపాటు దూరం ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్లు నిండిపోవడంతో స్వామి దర్శనానికి ఎక్కువ సమయం పట్టింది. ఎండ తీవ్రత ఎక్కువగా వుండడం, ఆలయ అధికారులు మంచినీటిని ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు తీవ్ర అహనం చెందారు. బయట దుకాణాల్లో వాటర్ బాటిళ్లు కొనుక్కోవాల్సి వచ్చిందని వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొప్పిశెట్టి హరిబాబు, తోలేటి శ్రీను తదితరులు వచ్చి ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావును నిలదీశారు. ఆలయానికి వచ్చే భక్తులకు కనీస వసతులను కల్పించడం లేదని, కనీసం తాగునీరు కూడా ఇవ్వకపోతే ఎలా? ప్రశ్నించారు. క్యూ లైన్లలో వున్న భక్తులకు వెంటనే మంచినీరు సమకూర్చుతానని కూర్మేశ్వరరావు బదులిచ్చారు. కాగా స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం పూర్ణాహుతి నిర్వహించారు. రాతి మండపంలో ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు... కల్యాణ వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం, పూర్ణాహుతి, చూర్ణోత్సవం నిర్వహించారు. ఉపమాక వెంకన్నను సోమవారం పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల ఆర్వో కె.గీతాంజలి, ఎంజేపీ గురుకులాల జిల్లా కన్వీనర్ ఎస్.వెంకటరెడ్డి తదితర ప్రముఖులు దర్శించుకున్నారు.


రాజయ్యపేట తీరంలో సుదర్శన పెరుమాళ్ ఉత్సవమూర్తికి చక్రస్నానం

రాజయ్యపేట తీరంలో శ్రీవారి చక్రస్నానం

ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి చక్రస్నానం కన్నుల పండువగా జరిగింది. తొలుత ఉభయదేవేరులతో కూడిన కల్యాణ వేంకటేశ్వరుడిని రాజాధిరాజవాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం రాజయ్యపేట సముద్రతీరానికి తోడ్కొని వెళ్లారు. సుదర్శన పెరుమాళ్ ఉత్సవమూర్తికి చక్రస్నానం చేయించారు. అనంతరం కల్యాణ వేంకటేశ్వరుడిని మధుపర్కాలు, పట్టుపీతాంబరాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

నరేంద్రపురంలో గ్రావెల్ దోపిడీ

- అర్ధరాత్రి ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు, ట్రాక్టర్లతో తరలింపు
- దర్జాగా అమ్ముకుంటున్న వైసీపీ నాయకులు


నరేంద్రపురం వద్ద గ్రావెల్ తవ్విన ప్రదేశం, (ఇన్‌సెట్‌లో) మల్లవరంలో డంప్ చేసిన గ్రావెల్

అచ్యుతాపురం, మార్చి 25: మండలంలోని మల్లవరం పంచాయతీ నరేంద్రపురం వద్ద ఆదివారం రాత్రి వైసీపీ నాయకుల అండతో జోరుగా గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల శబ్దాలు విని స్థానిక యువకులు రావడంతో గ్రావెల్ తవ్వకాలు ఆపేసి అక్కడి నుంచి జారుకున్నారు. అప్పటికే సుమారు 50 ట్రాక్టర్ల గ్రావెల్‌ను తరలించారు. వివరాల్లోకి వెళితే.. నరేంద్రపురం కొండ ప్రాంతంలో ఉండడంతో ఇక్కడ గ్రావెల్ పుష్కలంగా వుంది. స్థానిక వైసీపీ నాయకులు కొంతమంది అడపాదడపా గ్రావెల్ తవ్వి, రవాణా చేస్తున్నారు. ఇదే తరహాలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. గ్రావెల్ తరలించడానికి నాలుగు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకున్నారు. తెల్లవారు జామున శబ్దాలు విని నరేంద్రపురం యువకులు కొండప్రాంతానికి వెళ్లారు. వీరిని చూసి గ్రావెల్ తవ్వకం ఆపివేసి వాహనాలను అక్కడి నుంచి తీసుకుపోయారు. అప్పటికే సుమారు 50 ట్రాక్టర్ల గ్రావెల్‌ను తరలించుకుపోయారు. దీనిని మల్లవరం సాయిబాబా ఆలయం ముందు నిర్మిస్తున్న షాపింగ్ పునాదుల్లో వేశారు. ట్రాక్టర్ గ్రావెల్ వెయ్యి రూపాయల చొప్పున అమ్ముకుంటున్నారని స్థానికంగా చెప్పుకుంటున్నారు. ఇందులో రూ.600 ట్రాక్టర్ యజమానికి, రూ.200 ఎక్స్‌కవేటర్ కిరాయికి, మిగిలిన రూ.200 వైసీపీ నాయకుల జేబుల్లోకి వెళుతున్నట్టు తెలిసింది. గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నది వైసీపీ నాయకులు కావడంతో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు భయంతో చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెందుర్తి టికెట్ బండారుకు కేటాయించాలి

- టీడీపీ కరపత్రాలు దహనం చేసిన కార్యకర్తలు

పరవాడ, మార్చి 25: అనకాపల్లి జిల్లా పెందుర్తి టికెట్‌ను జనసేనకు కేటాయించడంపై తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సోమవారం నిరసన వ్యక్తంచేశారు. మండలంలోని వెన్నెలపాలెంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు సత్యనారాయణమూర్తి ఇంటి సమీపంలో టీడీపీ కరపత్రాలు దహనం చేశారు. పెందుర్తి టికెట్ విషయంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పునరాలోచన చేయాలని, బండారుకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇందల కొండలరావు, పైలా రథాల సన్యాసిరావు, పైలా చినఅక్కునాయుడు, మేడిశెట్టి బాలాజీనాయుడు, రొంగలి గోపాలకృష్ణ, పైలా రామచంద్రరావు, లోకిరెడ్డి అబి సన్యాసినాయుడు, పైలా వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇవ్వకుండానే ఇళ్ల నిర్మాణానికి యత్నం

- జగనన్న కాలనీ ఖాళీ స్థలంలో పునాదులకు గోతులు
- అడ్డుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

పాయకరావుపేట, మార్చి 25: ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు.. రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వకముందే ఇళ్ల నిర్మాణానికి పునాదులు తీయడం ప్రారంభించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది, పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సీతారాంపురం, నామవరం గ్రామాలకు చెందిన పలువురు ఇళ్ల స్థలాల కోసం ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ వాయిదా పడింది. కానీ దరఖాస్తుదారుల్లో పలువురు సోమవారం రాత్రి నామవరంలోని జగనన్న కాలనీలో ఖాళీ స్థలంలో ఇళ్ల నిర్మాణానికి పునాదులు తీయడం ప్రారంభించారు. సమాచారం అందుకున్న తహసీల్దారు సూర్యనారాయణ, సీఐ పి.అప్పలరాజు, సిబ్బందితో వచ్చి గోతులు తీయడాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత సర్వే చేసి ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇస్తామని, అప్పటి వరకు ఇక్కడ ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టవద్దని స్పష్టం చేశారు. తమ ఆదేశాలను ధిక్కరిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇదిలావుండగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తామంటూ అధికార పార్టీకి చెందిన కొంతమంది స్థానిక నాయకులు డబ్బులు వసూలు చేశారని, వీరి అండతోనే ఇంటి పట్టా మంజూరు కాకుండానే ఇళ్ల నిర్మాణానికి పునాదులు తవ్వుతున్నారని తెలిసింది.

అప్పన్నకు పెళ్లి నిశ్చయం

- సంప్రదాయబద్ధంగా స్వామివారి డోలోత్సవం
- వచ్చే నెల 9న పెళ్లి రాట
- 19న వార్షిక తిరు కల్యాణం


డోలికలో స్వామిని ఊపుతున్న స్వాములు


తిరువీధిలో స్వామివారు

సింహాచలం, మార్చి 25 : వరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణం అడివివరం గ్రామ దేవత, అప్పన్న సోదరి పైడితల్లి అమ్మవారి కుమార్తె శ్రీమహాలక్ష్మితో నిశ్చయమైంది. సోమవారం ఉదయం కొండ దిగువన అప్పన్న పెళ్లి చూపులు జరిగాయి. ఉత్సవంలో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. నిత్య హోమాలు, పూజలనంతరం స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో బుగ్గన చుక్కతో పెళ్లి కుమారుడిలా తీర్చిదిద్దారు. ఆలయ బేడా మండపంలో ముమ్మారు తిరువీధి చేసి అర్చక స్వాములు చూర్ణాలను పట్టుకుని వేద మంత్రోచ్ఛారణల నడుమ ప్రదక్షిణలు చేశారు. తొలుత అంతరాలయంలో మూలవిరాట్ వద్ద యోగానంద నారసింహునికి, అనంతరం బేడా మండపంలోని సింహవల్లీ తాయార్, ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో, లక్ష్మీనారాయణుల సన్నిధిలో ఆళ్వారుల సన్నిధిలో చూర్ణాలతో పూజలు చేశారు. అనంతరం స్వామివారిని వేద పండితులు వెంట రాగా మంగళవాయిద్యాల నడుమ మెట్ల మార్గంలో కాలినడకన కొండదిగువకు బోయీలు మోసుకొచ్చారు. తొలి పావంచా వద్ద దేవస్థానం ఈఓ సింగల శ్రీనివాసరావు, ట్రస్టీలు, అడివివరం గ్రామానికి చెందిన భక్తులు ఘనంగా ఆహ్వానం పలికారు. అక్కడి నుంచి గ్రామస్థులు, భక్తులు, ఆలయ అధికారులు వెంట రాగా స్వామివారు పైడితల్లి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. తనతో వివాహానికి ఆమె కుమార్తెను ఇవ్వమని కోరగా అందుకు ఆమె తొలుత తిరస్కరించి ఎట్టకేలకు సమ్మతించడంతో అమ్మవారికి పసుపు కుంకుమలు ఇచ్చి అక్కడి నుంచి పుష్కరిణి సత్రం ప్రాంగణంలోని ఉద్యానవన మండపంలో బంధుమిత్రులు, సిబ్బందితో కలిసి స్వామి ఆనందాన్ని పంచుకున్న ఘట్టాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని డోలిక (ఊయల)లో ఉంచి పూజలు చేశారు. తరువాత నాలుగు రకాల చూర్ణాలను మిళితం చేసి తొలుత స్వామివారిపై, అర్చక స్వాములపై చల్లారు. ఈ సందర్భంగా మహాభారతంలోని డోలాయమానం గోవిందం, మధ్యస్థం మాధవం అంటూ మంత్రాలను పాటగా వినిపించారు. అనంతరం కొండదిగువ మూడు మాడవీధుల్లో పల్లకిలో తిరువీధి నిర్వహించారు. తిరువీధిలో మార్గం పొడవునా భక్తులు పూలు, పండ్లతో నీరాజనాలు సమర్పించారు. కాగా వచ్చే నెల 19న స్వామి వారి వార్షిక తిరు కల్యాణ మహోత్సవం, 9న పందిరి రాట ఉత్సవం నిర్వహించనున్నట్టు ఈఓ ప్రకటించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు విఫలం

- వైసీపీ శ్రేణుల అరాచకాలు, దౌర్జన్యాలు, హింసాకాండ పెచ్చుమీరాయి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపణ
- సీఎం సొంత జిల్లాలో చేనేత కుటుంబ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్


మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, మార్చి 25: రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ శ్రేణుల అరాచకాలు, దౌర్జన్యాలు, హింసాకాండలు పెచ్చుమీరాయని, ఎన్నికల కోడ్ అమలు వున్నందున వీటిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సొంత జిల్లాలో రెవెన్యూ అధికారులు చేసిన అన్యాయంతో మనస్తాపం చెంది చేనేత కుటుంబం సామూహిక ఆత్మహత్యకు పాల్పడిందని, ఇందుకు వైసీపీ ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. చేనేత కుటుంబానికి చెందిన భూమి రికార్డులను తారుమారు చేసి వైసీపీ నేతకు అనుకూలంగా వ్యవహరించిన రెవెన్యూ అధికారులపై హత్యానేరం కింద కేసులు నమోదు చేయాలని అన్నారు. జగన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీనవర్గాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గింజాల లక్ష్మణరావు, గుడాల సత్యనారాయణ, బత్తుల లక్ష్మి, తిప్పాన అప్పారావు, పూడి త్రినాథరావు, శీరం వెంకటలక్ష్మి, బుద్ద భువనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలతో గ్రామ వలంటీర్

- ఎంపీడీవో నోటీసు జారీతో రాజీనామా


వైసీపీ నేతలతో వున్న వలంటీర్ నానాజీ (ఎర్ర గీత వున్న వ్యక్తి)

అచ్యుతాపురం, మార్చి 25: ఎలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజును కలిసేందుకు కొంతమంది కాపు నాయకులు ఆదివారం కొండకర్లలో ఎమ్మెల్యే అతిథిగృహానికి వెళ్లారు. వీరి వెంట మండలంలోని దిబ్బపాలెం పంచాయతీ క్లస్టర్-8లో వలంటీర్‌గా పనిచేస్తున్న కూనిశెట్టి నానాజీ వున్నాడు. వైసీపీ నాయకులు విడుదల చేసిన ఫొటోల్లో వలంటీర్ కనిపించడంతో జనసేన నాయకులు ఎంపీడీఓ సురేశ్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ద్వారా వలంటీర్ నానాజీకి నోటీసు ఇచ్చారు. కానీ అతను సంజాయిషీ ఇవ్వకుండా వలంటీర్ పోస్టుకు రాజీనామా చేశాడని ఎంపీడీవో తెలిపారు.

నేటి నుంచి శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


సిద్ధమైన యాగశాల

సింహాచలం, మార్చి 25 : సింహగిరిపై లోక కల్యాణార్థం మంగళవారం నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు జరిగే శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విజయవాడకు చెందిన ఆధ్యాత్మికవేత్త త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారి మంగళా శాసనాలతో ఆగమ శాస్త్ర విధానంలో మహా యజ్ఞం చేపట్టనున్నట్టు ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఉత్సవానికి అడివివరం గ్రామస్థులను ఆహ్వానిస్తూ సోమవారం పురవీధుల్లో వైభవంగా శోభాయాత్ర జరిపారు. యాగం కోసం ఏడు హోమ కుండాలను యాగశాల ఆవరణలోని అన్ని దిక్కుల్లోనూ సిద్ధం చేశారు. యాగం జరిగే పరిసరాలతో పాటు సింహగిరిని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. తొలిరోజు ఉదయం 10 గంటలకు రుత్విక్ సమావేశం ఏర్పాటు చేసి, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి ఉత్సవాంగీకారం, రుత్వికరణం జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5 గంటలకు గోవిందరాజస్వామిని సింహగిరి మాడవీధుల్లో తిరువీధి, మృత్స్యంగ్రహణము, అంకురారోపణము సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశారు. కాగా యజ్ఞం పూర్తయ్యే వరకు సింహాద్రినాథుని దేవాలయంలో జరిగే అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

రైల్వే ప్రయాణికుల సమస్యలు పట్టించుకోండి

- ఉన్నతాధికారులకు లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ లేఖలు


ఉన్నతాధికారులకు పంపిన లేఖను చూపిస్తున్న భీశెట్టి బాబ్జీ

అనకాపల్లి టౌన్, మార్చి 25 : అనకాపల్లి రైల్వే ప్రయాణికుల సమస్యలను రైల్వే శాఖ అధికారులు పట్టించుకోవాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం, విజయవాడ డీఆర్ఎంలకు రాసిన లేఖలను విడుదల చేశారు. రోజూ అనకాపల్లి నుంచి విశాఖ వెళ్లి వచ్చే వారిలో ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, చిల్లర వర్తకులు, సాధారణ ప్రయాణికులు సుమారు ఐదు వేల మంది ఉన్నారని, వీరికి రైలు సదుపాయం లేకపోవడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గుంటూరు-రాయగడ, గుంటూరు-విశాఖ సింహాద్రి, మచిలీపట్నం- విశాఖ, కాకినాడ- విశాఖ రైళ్లను తరచూ రోజుల తరబడి ఆపేస్తున్నారని, ముఖ్యంగా రెండు నెలలుగా ఈ రైళ్లు నడవకపోవడంతో అనకాపల్లి-విశాఖ మధ్య రోజూ రాకపోకలు సాగించే ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. విశాఖ-రాజమండ్రి రైలు ఒక్క రోజు కూడా సమయానికి రాదని పేర్కొన్నారు. సమావేశంలో కె.రమణ, కె.నరసింగరావు, ఎ.వెంకటరావు పాల్గొన్నారు.

వెంకటేశ్వరుని కల్యాణంలో అపశృతి

▸ కత్తులతో పొడిచి యువకుడి హత్య

▸ తప్పించుకునే ప్రయత్నంలో మరో ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలు

▸ పరారీలో ఆరుగురు నిందితులు


సాయికుమార్ (ఫైల్ ఫొటో)

ఎటపాక, మార్చి 26 : అల్లూరి జిల్లా ఎటపాక మండలం వెంకటరెడ్డిపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణంలో అపశృతి చోటుచేసుకుంది. బహిర్భూమికి వెళ్లే సమయంలో గొడవ జరిగి అది పెద్దదిగా మారి యువకుని హత్యకు దారి తీసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎటపాక మం డలం వెంకటరెడ్డిపేటకు చెందిన స్థానిక యువకుడైన కొరిమి సాయి మధ్యాహ్నం సమయంలో వెంకటేశ్వరుడి ఆలయం సమీపంలోని జామాయిల్ తోటవైపు బహిర్భూమికి వెళ్లాడు. అదే జామాయిల్ తోటలో భద్రాచలం పట్టణానికి చెందిన ఆరుగురు యువకులు ఆహార పదార్థాలను తింటున్నారు. ఆవైపు బహిర్భూమికి వెళ్లేసాయిని చూసి భద్రాచలంనకు చెందిన ఆరుగురు యువకులు ఇటువైపు ఎందుకు వచ్చావు రా... అంటూ స్థానికుడైన సాయివద్ద నుంచి వాటర్‌బాటిల్ లాక్కుని, ఇష్టానుసారం దుర్భాషలాడుతూ గొడవపడి తిట్టి పంపారు దాంతో సాయి తన స్నేహితులైన అజ్మీర సాయికుమార్, నక్కిన పోయిన శ్రీనును వెంట తీసుకుని వారి వద్దకు వెళ్లాడు. ఈనేపథ్యంలో రెండు గ్రూపుల యువకులు ఘర్షణ పడ్డారు. అనంతరం బాహాబాహికి దిగారు. ఈ నేపథ్యంలో భద్రాచలం పట్టణానికి చెందిన ఓ యువకుడి వద్ద బటన్ కత్తి ఉండడంతో అజ్మీర సాయికుమార్‌పై కత్తి పొట్లు పొడిచాడు. తీవ్రంగా గాయపడ్డ సాయిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. సాయికుమార్ స్నేహితులైన సాయి, నక్కిన పోయిన శ్రీనులపై ఆరుగురు యువకులు కత్తులతో దాడి చేసే ప్రయత్నం చేశారు. అయితే వారు తప్పించుకోవడంతో చేతులపై తీవ్ర గాయా లయ్యాయి. గాయపడ్డ యువకులను ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన సాయికుమార్‌ది రాంగో పాలపురం తండా, పదో తరగతి చదువుతున్నాడు. ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు హత్యపై దర్యాప్తు చేస్తున్నారు. ఎన్నికల వేళ, అందులోను ఆధ్యాత్మిక ప్రదేశం చోట హత్య జరగడంపై వెంకటేశ్వరుడి కల్యాణానికి విచ్చేసిన భక్తులు భయందోళనకు గురయ్యారు. మద్యంమత్తులో దాడి చేసినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇటీవల భద్రాచలం పట్టణానికి చెందిన కొందరు పొరుగున ఉన్న ఎటపాకను అడ్డాగా మార్చుకుంటూ గంజాయి సేవిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే ఎటపాకను అన్నీ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. ఇదే నేపథ్యంలో గంజాయి మత్తులోనే యువకులు దాడులకు తెగబడుతున్నట్లు విమర్శలు లేకపోలేదు. పోలీసులు, నిఘా వ్యవస్థలు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా కుమారస్వామి రథోత్సవం


శూలాలతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, మార్చి 25: చింతూరు మండలం వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలోసోమవారం కుమారస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహిం చారు. జలాశయాలవద్ద ఉన్న మారమ్మ ఆలయానికి ఆంధ్ర, ఒడిశా, చత్తీస్‌గడ్, తెలంగాణా, తమిళనాడు రాష్ట్రా లు ఉదయమే చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు శూలాల వేషధారణలో సుబ్రహ్మణ్య నామ స్మరణ చేస్తూ డొంకరాయి పురవీధుల్లో ఊరేగించారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పాల్గొన్న ఉత్తర పౌర్ణిమ మహోత్సవాలు ముగిశాయి. మాల ధరించిన స్వాములు వీపుపై గుచ్చి శూలాలతో రథాలను లాగుతూ రథోత్సవంలో పాల్గొన్నారు. హరోం హర వేల్వేల్ మురగ అంటూ ముందుకు సాగారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్, పోలీస్ సిబ్బంది, సీఆర్పీఎఫ్/42 బెటాలియన్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్.సుబ్రహ్మణ్యంశర్మ, కమిటీ సభ్యులు ఎం.రామకృష్ణ, ఎస్.దొరబాబు, కె. బాబ్జి తదితరులు కమిటీసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రాజవొమ్మంగి, మార్చి 25: అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని మారేడుబాకకు చెందిన చిట్టోజి లోవరాజు అనే వ్యక్తి 2018 ఆగస్టు 3వ తేదీన ఓ మైనర్ బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అత్యాచారయత్నానికి ప్రయత్నించి ఆమె ప్రతిఘటించడంతో కత్తితో ఆమెపై దాడిచేసి పరారయ్యాడు. ఘటనపై బాలిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ గోపి నరేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. తరువాత లోవరాజు బెయిల్‌పై బయటకు రాగా సోమవారం పోక్సో స్పెషల్ కోర్టులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జీ తీర్పునిచ్చారు.

పసుపు ధర పతనం

... 3వ పేజీ తరువాయి

చేశారు. వర్తకుల్లో పోటీ పెరగడం వల్ల రైతులకు మంచి ధర లభించింది. ప్రస్తుతం పసుపు ధరను వర్తకులు ఒక్కసారిగా ధర తగ్గించేశారు. జాతీయ మార్కెట్‌లో ధర పడిపోయిందని, సోమవారం ఆర్‌వీనగర్ వారపు సంతలో వర్తకులు రూ.115 ధరకు కిలో పసుపును కొనుగోలు చేశారు. పసుపు ధర ఒక్కసారిగా తగ్గిపోవడంతో ఆదివాసీ రైతులు ఆందోళన చెందుతున్నారు.

విమ్స్ అప్‌గ్రేడ్ ప్రతిపాదన అటకెక్కినట్టేనా!?

... 3వ పేజీ తరువాయి

ద్వారా మరింతమందికి సేవలు అందించే అవకాశం ఏర్పడుతుంది.

పీజీ మెడికల్ కాలేజీ హామీ కూడా..

విమ్స్‌లో పీజీ మెడికల్ కాలేజీ ఏర్పాటుచేస్తామని గతంలో ప్రకటించారు. సుమారు మూడేళ్ల కిందట ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టారు. ఆరోగ్యశాఖ అధికారులు సమీక్షించి ఏడాదిలో ప్రక్రియ పూర్తవుతుందని విమ్స్ అధికారులకు సమాచారాన్ని పంపించారు. అన్నీ సవ్యంగా సాగితే ఈ ఏడాదిలో అడ్మిషన్లు జరగాల్సింది. కానీ, కారణమేమిటో గానీ పీజీ మెడికల్ కళాశాలకు కూడా గ్రీన్‌సిగ్నల్ రాలేదు.

అంబరాన్నంటిన హోలీ సంబరం

... 3వ పేజీ తరువాయి


జెండాను పట్టుకున్న గొల్లోరి రాము, వంతల శ్రీను

ఆలయ కమిటీ శాలువాతో సన్మానించి రూ.1116 నగదును అంద జేసింది. అలాగే తాజంగి పొలిమేర వరకు వారిని ఆలయ కమిటీ ఊరేగింపుగా తీసుకొచ్చింది. రానున్న ఖరీఫ్‌లో వివిధ పంటల నాట్లును జెండా పట్టుకున్న యువకులతో స్థానిక గిరిజనులు మొదటిగా వేయిస్తారు. ఈ ఉత్సవంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి, సర్పంచ్ వంతల మహేశ్వరరావు, అర్చకులు సీసా నీలకంఠం, ఉత్సవ కమిటీ సభ్యులు బాబూరావు, సదాశివ, రాజరావు, శ్రీరామ్ పాల్గొన్నారు.

రంప అటవీ డివిజన్లో ఇంటి దొంగలు

▸ 400కు పైగా టేకు చెట్లు నరికేసి 300కి పైగా తరలించేసిన వైనం ▸ ఇద్దరు తాగుబోతు దొంగల వాగ్వాదంతో భాగోతం బట్టబయలు

▸ రంగంలోకి దిగి నిగ్గుతేల్చిన అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ▸ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇతర టెక్నాలజీతో బాధ్యులను గుర్తించే చర్యలు


మిగిలిపోయిన కలపను కొలవడానికి వచ్చిన అటవీశాఖ అధికారులు

రంపచోడవరం, మార్చి 25: అల్లూరి జిల్లా రంపచోడవరం అటవీశాఖ డివిజన్లో సుమారు 400కు పైగా టేకు చెట్లు అక్రమ నరికివేతకు గురికాగా వాటిలో సుమారు 300కు పైగా చెట్లు గల్లంతయ్యాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం తరలిపోయిన చెట్ల విలువ సుమారు రూ.40 లక్షలు కాగా, సుమారు రూ.12 లక్షల విలువైన టేకు దిమ్మలను తరలింపు కోసం సిద్ధం చేసుకోగా ఇందులో భాగస్వాములైన ఇద్దరు తప్పతాగి తెచ్చుకున్న వాగ్వివాదం ఈ మొత్తం భాగోతాన్ని బట్టబయలు చేసింది. దీనిపై లోతుగా గమనిస్తే ఇదంతా అటవీశాఖలోని ఇంటి దొంగలందరూ తలాపాపం తిలా పిడికెడు అన్నచందంగా తేలింది. రాజమహేంద్రవరంలోని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ వై.శ్రీనివాసరెడ్డి నేరుగా రంగంలోకి దిగి జరిగిన అటవీ వినాశనంతోపాటు ఎంత విలువైన చెట్లు దొంగిలించబడ్డాయో నిగ్గు తేల్చారు. ఎవరిపాత్ర ఎంత ఉందో, ఇందుకు గల కారణాల నిగ్గు తేల్చేందుకు ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఆరుగురు డి.ఎఫ్.ఓ.లతో ఆరు కమిటీలను నియమించారు. రంపచోడవరం, మారేడుమిల్లి అటవీశాఖ రేంజ్ పరిధిలోని వెలుగుచూసిన ఈ భాగోతం పూర్వాపరాలు ఇలా ఉన్నాయి.

రంపచోడవరం రేంజ్ మారేడుమిల్లి రేంజ్ పరిధిలో అటవీశాఖకు చెందిన టేకు ప్లాంటేషన్లు విస్తృతంగా ఉన్నాయి. వాస్తవానికి నిర్దేశిత కాలం అనంతరం ఆయా ప్లాంటేషన్లలో టేకు చెట్లను అటవీశాఖే నరికించి అనంతరం కొత్త ప్లాంటేషన్లను వేయిస్తోంది. రంపచోడవరం రేంజ్ పరిధిలోని దేవరపల్లి బీటు, మారేడుమిల్లి రేంజ్ పరిధిలోని మారేడుమిల్లి బీటులలో ఉన్న టేకు ప్లాంటేషన్లలో సుమా రు 400కు పైగా టేకుచెట్లను అక్రమంగా నరికేసి, వాటిలో సుమారు రూ.40 లక్షలకు పైబడిన విలువ కలిగిన 300కు పైగా టేకు చెట్లను తరలించేశారు. ఎంతో పగడ్బంధీగా చీపురు పుల్లను సైతం అడవి దాటకుండా కాపు కాసే అటవీ శాఖ రాణా(చెక్‌పోస్టు)లను ఈ టేకు కలప దర్జాగా దాటిపోయింది. ఈ అటవీ సంరక్షణ కోసం ఏర్పాటుచేసిన బేస్ క్యాంపులలో తాత్కాలికంగా పనిచేస్తున్న వారే ఇందులో కీలకపాత్ర పోషించారని, వారిలో ఇద్దరు తప్పతాగి ఒకరిపై ఒకరు దొంగతనాలను ఆపాదించుకుంటూ వాగ్వాదానికి దిగడం ద్వారా వారు వెలగబెట్టిన భాగోతం మొత్తం బయటపడింది. ఇది తెలిసిన మరుక్షణం రాజమండ్రి ఫ్లయింగ్ స్క్వాడ్ డి.ఎఫ్.ఓ. ప్రాథ మిక విచారణ జరిపి చీఫ్ కన్జర్వేటర్‌కు నివేదించారు. దీంతో చీఫ్ కన్జర్వేటర్ శ్రీనివాసరెడ్డి ఈనెల కొద్ది రోజుల క్రితం ఈ రెండు రేంజ్‌ల పరిధిలో పర్యటించారు. సుమారు రూ.50లక్షలకుపైగా అటవీ వినాశనం జరిగి, అటవీ సంపద దొంగతనానికి గురైందని గుర్తించారు.


తరలించుకుపోగా మిగిలిపోయిన టేకు కలప

ఇక్కడ నరికివేయబడిన టేకు చెట్లు ఏఏ రాణాల మీదుగా ఎక్కడకు వెళ్లిపోయాయో, ఎవరెవరు ఇందులో భాగస్వాములుగా ఉన్నారో, క్షేత్రస్థాయి నుంచి డివిజన్‌స్థాయి వరకూ అధికారులు, సిబ్బంది పోషించిన పాత్రలను నిగ్గుతేల్చాలని రాజమహేంద్రవరం ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో, కాకినాడ డీఎఫ్‌వో, భీమవరం డీఎఫ్‌వో, అమలాపురం డీఎఫ్‌వో, రాజమహేంద్రవరం డీఎఫ్‌వో, జంగారెడ్డిగూడెం సబ్‌డీఎఫ్‌ల ఆధ్వర్యంలో ఆరు బృందాలను నియమించారు. ఈ బృందాలు గత ఏడాది కాలంగా రంపచోడవరం డివిజన్‌పరిధిలో నమోదైన అన్నిరకాల కేసులను, ఆయా ప్లాంటేషన్లపై సాగిన అధికారుల పరిశీలనా నివేదికలను, ఆయా అధికారుల టూరు డైరీలను కూడా పరిశీలించాలని సి.సి.ఎఫ్ ఆదేశించారు. ఇంత పెద్దఎత్తున అటవీ వినాశనమే కాకుండా ప్రభుత్వ ఖజానా ఆదాయానికి నష్టం వాటిల్లడానికి పైనుంచి కింద వరకూ నిర్లక్ష్యం వహించిన అందరిపైనా చర్యలకు చీఫ్ కన్జర్వేటర్ రంగం సిద్ధం చేస్తున్నారు.

సంగోడిలో భక్తిశ్రద్ధలతో శివలింగం ప్రతిష్ఠ


శివలింగాన్ని ప్రతిష్ఠ చేస్తున్న స్వరూప నందేంద్రస్వామి

పాడేరు రూరల్, మార్చి 25 : మండలంలోని మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలో ఈశ్వరీయ ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం శివలింగం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకకు విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపా నందేంద్ర సరస్వతి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో హోమాలు, అర్చనలు, అభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఆర్‌వో బి.పద్మావతి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, పంచాయతీ సర్పంచ్ లంకెల చిట్టమ్మ, బ్రహ్మకుమారీస్‌కు చెందిన నాలుగు జిల్లాల ఇన్‌చార్జిలు బీకే రజినీదీదీ, రమా, అల్లూరి జిల్లా బ్రహ్మకుమారీస్ విజయ (మున్ని), లక్ష్మి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


హోమం గుండం వద్ద పూజలు చేస్తున్న ఐటీడీఏ పీవో తదితరులు

మే 5 నుంచి చింతపల్లిలో ముత్యాలమ్మ జాతర


ఎన్నికైన అధ్యక్షుడు వినాయకరావు తదితరులు

చింతపల్లి, మార్చి 25 : ఉత్తరాంధ్రలో పేరెన్నికగన్న ఉత్సవాలలో ఒకటైన ముత్యాలమ్మ జాతర చింతపల్లిలో మే ఐదో తేదీన నిర్వహించేందుకు పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు ఏర్పాట్లుపై సోమవారం ఇక్కడ గ్రామ సభ నిర్వహించారు. ఆలయ అర్చకులు సుర్ల అప్పారావు, గ్రామపెద్దలు మాట్లాడుతూ ఈ ఏడాది గంధం అమావాస్య మే ఎనిమిదో తేదీన వచ్చిందని, దానికి ముందు జాతర నిర్వ హించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆలయంలో పూజలు నిర్వహించి జాతర తేదీలను ప్రకటించారు. జాతర ప్రతి ఏడాది మాదిరిగానే నాలుగు రోజుల పాటు నిర్వహించాలని తీర్మానించారు. ఎంపీపీ కోరాబు అను షాదేవి, జడ్పీటీసీ పోతురాజు బాలయ్య, జీసీసీ ఉద్యోగుల సంఘం నాయకులు దురియా హేమంత్ కుమార్, బీఏ రాజు, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు బొడు గంగరాజు, దేపూరి శశి కుమార్, యూవీ గిరి, కుడుముల వెంకట రమణ, గసాడి పద్మనాభం, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి, నాయకులు పెదిరెడ్ల బేతాళుడు, తాటిపాకల రమేశ్, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, వైసీపీ నాయకుడు జల్లి సుధాకర్, మండలాధ్యక్షుడు మోరీ రవి పాల్గొన్నారు. ఇదిలావుంటే, ముత్యాలమ్మ జాతర ఉత్సవ కమిటీని నియమించారు. అధ్యక్షుడుగా పసుపులేటి వినాయకరావు, ప్రధాన కార్యదర్శిగా పెదిరెడ్ల బేతాళుడు, కోశాధికారిగా గసాది పద్మనాభం ఎన్నికయ్యారు. పూర్తి కమిటీని ఈనెల 28 తేదీన నియమించేందుకు నిర్ణయించారు.

ఐటీడీఏ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్, డ్రైవర్ విధుల నుంచి తొలగింపు

▸ అక్రమాలపై స్పందించిన ఐటీడీఏ పీవో

పాడేరు రూరల్, మార్చి 25 : జిల్లా కేంద్రం పాడేరులో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్యాస్ ఏజెన్సీలో సిబ్బంది అక్రమాలపై ప్రాజెక్టు ఆఫీసర్ అభిషేక్ స్పందించారు. లబ్ధిదారుల నుంచి గ్యాస్ సిలెండర్‌రుకు రూ.వెయ్యి నుంచి రెండు వేల వరకు అక్రమంగా వసూలు చేస్తుండడంతో పాటు పదవీ విరమణ చేసిన డ్రైవర్‌ను ఇంకా అక్కడే కొనసాగిస్తున్నట్టు వచ్చిన ఆరోపణలపై ఆరా తీశారు. అనంతరం మేనేజర్, డ్రైవర్‌లను అక్కడ విధుల నుంచి తక్షణమే తొలగించి, వేరొక సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలని పీవో ఆదేశించారు. అంతేకాకుండా ఎస్‌డీసీ (టీడబ్ల్యూ)ని విచారణాధికారిగా నియమించారు. ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక తనకు అందించాల్సిందిగా ఆయనకు సూచించారు. అదే విధంగా ఐటీడీఏలో మినిమం టైం స్కేల్లో పనిచేస్తూ 60 ఏళ్లు పూర్తయిన ముగ్గురు సిబ్బంది ఉన్నారని విలేకరులకు తెలిపారు. వారిని 62 ఏళ్ల వరకు కొనసాగించాలా వద్దా అన్న అంశంపై స్పష్టత కోసం గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు లేఖ రాసినట్టు ఆయన వివరించారు.

'వైసీపీ అరాచక పాలనకు ఓటుతో బుద్ధి చెప్పండి'


విలేకరులతో మాట్లాడుతున్న దొన్నుదొర

అరకులోయ, మార్చి 25 : టీడీపీ హయాంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని పెట్టుబడుల ఆకర్షణలో మొదటి స్థానంలో నిలిపితే, నేడు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి గంజాయి, డ్రగ్స్ రవాణాలో రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలిపారని అరకు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి సియ్యారి దొన్నుదొర ఎద్దేవా చేశారు. సోమవారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. జగన్‌రెడ్డి విశాఖను పరిపాలనా రాజధాని చేస్తానంటే ఉత్తరాంధ్రపై ప్రత్యేక ప్రేమ కనబరుస్తున్నారేమోనని భావించామన్నారు. కానీ ఇటీవల అక్కడ భారీగా డ్రగ్ పట్టుబడడంతో విశాఖను డ్రగ్ క్యాపిటల్‌గా మార్చేస్తున్నారని ఇప్పుడిప్పుడే ప్రజలందరికీ తెస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి దోపిడీ, అరాచక పాలకుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే ప్రజలంతా ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో ఆదివాసీల ప్రాతినిథ్యం లేకుండా చేసేందుకు బీజేపీ ఎత్తులు

▸ ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర

పాడేరు రూరల్, మార్చి 25 : సార్వత్రిక ఎన్నికల్లో అరకు ఎంపీగా బరిలోకి దిగుతున్న కొత్తపల్లి గీత అభ్యర్థిత్వాన్ని అంతా నిరసించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ రామారావుదొర పిలుపునిచ్చారు. ఇక్కడి గిరిజన భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చట్ట సభల్లో ఆదివాసీల ప్రాతినిథ్యం లేకుండా చేసి, ఏజెన్సీలో వనరుల దోపిడీకి పాల్పడాలని బీజేపీ చూస్తుందని ఆరోపించారు. ఇందులో భాగంగానే కుల వివాదం ఎదుర్కొంటున్న కొత్తపల్లి గీతకు అరకు ఎస్టీ పార్లమెంట్ నియోజకవర్గ టికెట్‌ను బీజేపీ కట్టబెట్టిందని పేర్కొన్నారు రాష్ట్రంలో రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలపై సమీక్షించిన అనంతరం ఈ ఎన్నికల్లో జేఏసీ నిర్ణయాన్ని ప్రకటిస్తుందని ఆయన వివరించారు.

వాడవాడలా ఆనందోత్సాహాల నడుమ హోలీ

▸ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు

▸ ఎటు చూసినా కోలాహలం


ముంచంగిపుట్టులో హోలీ సంబరం జరుపుకుంటున్న పిల్లలు, యువకులు

ముంచంగిపుట్టు, మార్చి 25 : హోలీ పండగను జిల్లాలోని పలు మండలాల్లో ప్రజలు సోమవారం ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముందు రోజు రాత్రి ముంచంగిపుట్టుతో పాటు కొండపడ, దారెల తదితర గ్రామాల్లో జాతరలు నిర్వహించారు. సోమవారం ఉదయం ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద అల్లూరి యూత్ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే సంబరాన్ని ఏర్పాటు చేశారు. ఉట్టి కొట్టిన వారికి మూడు వేల రూపాయలను నిర్వాహకులు బహుమతిగా అందజే శారు. ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : మండలంలో హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నలు, పెద్దలు ఒకరికి ఒకరు రంగులు పూసుకుంటూ తెగ సందడి చేశారు.


డుంబ్రిగుడలో రంగులు పూసుకుంటూ సందడి చేస్తున్న విద్యార్థులు

ఈ వేడుక సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో పలువురు విద్యార్థులు పాఠశాలలకు చేరుకుని స్నేహితులంతా కలిసి రంగులు చల్లుకున్నారు. డుంబ్రిగుడ, అరకు, కించుమండలలో ఈ వేడుక మరింత ఉత్సాహంగా సాగింది.

హుకుంపేట : హోలీ పండగను మండలవాసులు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఉయదం ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం స్వీట్లను పంచుకున్నారు. చిన్నలు, పెద్దలు అన్న తేడా లేకుండా అంతా భాగస్వాములు కావడంతో ఎటుచూసినా సందడి వాతావరణం నెలకొంది. మారుమూల గ్రామాల్లోనూ ఈ వేడుకను జరపుకున్నారు.

ఏప్రిల్ 28న సీలేరులో మారెమ్మ పండగ


ఉత్సవాల నిర్వహణపై చర్చిస్తున్న గ్రామ పెద్దలు

సీలేరు, మార్చి 25 : మండల కేంద్రం సీలేరులో మారెమ్మ అమ్మవారి ఉత్సవం నిర్వహణపై సోమవారం కమిటీ అధ్యక్షుడు కారే శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 14న తమిళ సంవత్సరాదితో ఉత్సవం ప్రారంభించడంతో పాటు అదేరోజు రోజు అమ్మవారి జెండా ఎగురవేయాలని నిర్ణయించారు. అలాగే 16న గరగల అలంకరణ, అగ్నిగుండం, 27న గరగల ఊరేగింపు, 28న ప్రధాన పండగ నిర్వహించేందుకు అంతా తీర్మానం చేశారు. ఈ వేడుకను మరింత అంగరంగ వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సీలేరు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మే 26 నుంచి మోదకొండమ్మ పండగ


సమావేశానికి హాజరైన కమిటీ సభ్యులు, గ్రామస్తులు

హుకుంపేట మార్చి 25 : మండల కేంద్రం హుకుంపేటలో మోదకొండమ్మ పండగను మే 26వ తేదీ నుంచి మూడు రోజుపాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం సర్పంచ్ పూర్ణిమ, ఎంపీటీసీ కొమ్మ రమా ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు సమావేశమై నిర్ణయించారు. అనంతరం ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాంగి అనీల్, ఉపాధ్యక్షుడుగా కొర్రా నాగబాబులతో పాటు మరికొందరు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి సహకారంతో అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సాగిరి రాజారావు, గణేశ్, నూకరాజు, శివ, నానాజీ, శెట్టి ప్రసాద్, పాండి వెంకట్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారాతో ఇద్దరు అరెస్టు

జి.మాడుగుల, మార్చి 25 : మండలంలోని కుంబిడిసింగి పంచాయతీ సంఘం జంక్షన్‌లో సోమవారం ఇరవై లీటర్ల నాటు సారాతో ఇద్దరు వ్యక్తుల పట్టుబడినట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అదే పంచాయతీ అండంగిసింగికి చెందిన సీదరి బాలన్న, ముంచంగి బాబూరావులు రెండు క్యాన్లలో సారాతో పట్టుబడడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. గ్రామాల్లో సారా తయారు చేసినా, విక్రయించినా చట్టప్రకారం నేరమన్నారు. ఇటువంటి ఎక్కడ జరిగినా ప్రజలు తమ దృష్టికి తీసుకు వచ్చి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

'జెన్‌కో ఓ అండ్ డ్యామ్ టెండర్‌పై శాఖాపరమైన విచారణ చేపట్టాలి'

సీలేరు, మార్చి 25 : ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని ఓ అండ్ డ్యామ్ డివిజన్‌లో జరిగిన టెండర్‌పై శాఖాపరమైన విచారణ చేపట్టాలని కాంట్రాక్టర్ టి.నాగేంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పనులను ఈఈ నోటీసు బోర్డుపై ప్రదర్శించకుండా ఏకపక్షంగా తనకు అనుకూలమైన వ్యక్తులకు పనులను కట్టబెట్టారని ఆరోపించారు. టెండర్ ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా జరగడం వల్ల జెన్‌కోకు రావాల్సిన ఆదాయానికి నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ విషయమై ఈఈ లక్ష్మీనారాయణను వివరణ కోరగా, టెండర్ నిబంధనల ప్రకారం జరిగిందని స్పష్టం చేశారు.

రాత్రి వేళల్లో అనవసరంగా ఎవరూ బయటకు రావద్దు : సీఐ రమేష్



ముంచంగిపుట్టు, మార్చి 25 : ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రాత్రి వేళల్లో ఎవరూ అనవసరంగా బయట సంచరించవద్దని జి.మాడుగుల సీఐ ఆర్.రమేష్ సూచించారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో చోరీలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. రాత్రి 12 గంటలు దాటితే అత్యవసరమైతే తప్ప, ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ కె.రవీంద్ర పాల్గొన్నారు.